www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 17 ఫిబ్రవరి 2025



నేడు ప్రజా ఫిర్యాదులు స్వీకరణ

ప్రజాశక్తి - కడప

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ను సోమవారం సభాభవన్‌లో నిర్వహిస్తున్నట్లు డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునని తెలిపారు. డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10.00 గంటల వరకు ఉంటుందన్నారు .ప్రజలు 08562-2444 37 ల్యాండ్ లైన్ నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునని పేర్కొన్నారు.ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వామ్మో..పులులు





- పులుల సంచారంతో హడలెత్తుతున్న ప్రజలు

- పొలాలకు వెళ్లాలంటేనే భయపడుతున్న రైతులు



బలపనూరులో కరెంట్‌షాక్ కొట్టి మృతిచెందిన చిరుత (ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

పులివెందుల నియోజకవర్గంలో పులుల సంచార వరుస సంఘటనలతో కంటిమీద కునుకు లేకుండా రైతులు, ప్రజలు హడలెత్తుతున్నారు. పొలా లలోకి వెళ్లాలంటే రైతులు భయపడుతున్నారు. పులివెందుల మండల పరిధిలోని ఆర్ . తుమ్మలపల్లి గ్రామ పొలాలలో ఆదివారం ఉదయం పులిపిల్ల సంచరించినట్లు ప్రజలు తెలిపారు. గంగిరెడ్డి అనే రైతు నువ్వుల పంటలో పులి పిల్ల కనిపించిందని కేకలు వేయడంతో పారిపోయిందన్నారు. పది రోజుల నుంచి పులివెందుల నియోజకవర్గంలో పలు ప్రాంతాలలో పులి కనిపించిందని స్థానికులు పేర్కొంటున్నారు. మండల పరిధిలో నల్లపు రెడ్డి గ్రామ సమీపంలోని నాగమ్మ కుంటలో పులి సంచరించినట్లు రైతు విష్ణు వర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. అరటి సాగు నిమిత్తం తోట వద్దకు వెళుతుండగా అటువైపు పులి వెళ్లినట్లు గుర్తించానని, దాని అడుగులు ఫొటో తీశానని చెప్పారు. ఇకపోతే లింగాల మండలం కామసముద్రం గ్రామంలో మిద్దె ఆదినారాయణ అనే రైతు పొలం వద్ద ఒక పెద్ద పులి, మూడు చిన్న పులులు సంచరిస్తున్నట్లు సమాచారం ఇవ్వడంతో ఫారెస్ట్ అధికారులు, స్థానిక పోలీసులు, లింగాల తహశీల్దార్ ఈశ్వరయ్య పరిసర ప్రాంతాలలో పరిశీలించి చుట్టుపక్కల రైతులను ఆ పరిసర ప్రాంతాలకు వెళ్ళవద్దని గ్రామ రెవెన్యూ సహాయకుల ద్వారా సమాచారం ఇచ్చారు. సింహాద్రిపురం మండలం బలపనూరు సమీపంలో రైతు పొలానికి వేసిన కరెంటుకు చిరుత పులి మరణించింది. రైతు భయపడి పాతి పెట్టడం జరిగింది. ఫారెస్ట్ అధికారులకు విషయం తెలియడంతో రైతు పాతిపెట్టిన చిరుతను బయటకు తీసి అతనిపై కేసు నమోదు చేశారు. పులుల సంచారం రైతుల్లో ఆందోళన కలి గిస్తుంది. నామ మాత్రంగా తనిఖీలు నిర్వహిస్తారని అధికా రులపై రైతులు ఆరోపణలు చేస్తున్నారు. నియోజకవర్గంలో పలు ప్రాంతాలలో పులులు సంతరిస్తున్నాయని రైతులు చెబెతున్నా అధికారుల మాత్రం ఏమీ పట్టనట్లు వ్యవహించడంపై పలు విమర్శలు దారి తీస్తోంది. కేవలం నామమాత్రంగా తనిఖీలు చేస్తున్నారు తప్ప పూర్తిస్థాయిలో నిర్వహించలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వాటిని పట్టుకుని జంతుశాలలకు తగిలించాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.



పులి కన్పించడంపై మీడియాతో మాట్లాడుతున్న రైతు గంగిరెడ్డి

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం

- టిడిపి, వైసిపి కుమ్మక్కు రాజకీయాలే కారణం
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎం.ఎ. గఫూర్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన తీవ్ర అన్యాయానికి రాష్ట్రంలోని టిడిపి, వైసిపిల కుమ్మక్కు రాజకీయాలే కారణమని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్ విమర్శించారు. ఆదివారం కడప నగరంలోని రామకృష్ణనగర్‌లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో వైఎస్ఆర్ జిల్లాలో స్టీల్‌ప్లాంట్ మొదలుకుని, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు, రాజధానికి అమరావతి నిర్మాణానికి సైతం అప్పురూపంలో మాత్రమే విధిలింపులు చేసిందన్నారు. వైసిపి హయాంలో బటన్ నొక్కుడు రాజకీయాలతో విదిలింపులు చేసి, బటన్ నొక్కుడు ముసుగులో దోపిడీ రాజకీయాలు చేశారని విమర్శించారు. కరువు, నిరుద్యోగం, వరదలకు తావే లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2020 విజన్ డాక్యుమెంట్ స్థానంలో 2047 విజన్ డాక్యుమెంట్ పేరుతో కలలో తెలియాడే భ్రమలు కల్పిస్తున్నారన్నారు. మోసపూరిత రాజకీయాల కారణంగానే 2019లో తోకకత్తిరించారని గ్రహించాలని తెలిపారు. సాగునీరు మొదలుకుని రహదారులు, ప్రభుత్వ మెడికల్ కళాశాలల వరకు ప్రయివేటు జపం చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన టిడిపి, వైసిపి కుమ్మక్కు రాజకీయాల్లో మునిగిన నేపథ్యంలో బిజెపి తమ కార్పొరేట్, మతోన్మాద రాజకీయాలను వేగవంతం చేయడానికి గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదానీ సోలార్ విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని అధికార టిడిపి లోపాయికారీగా అంగీకరిస్తున్నట్లు ఉందన్నారు. గత వైసిపి హయాంలో కుదిరిన రూ.150 కోట్ల అక్రమ అదానీ ఒప్పందాలను రద్దు చేయకపోవడంలోని ఆంతర్యమేమిటో వెల్లడించాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లోని హుూతి, కుకీ జాతి ప్రజల మధ్య ఆయుధాలతో యుద్ధం చేయాల్సిన దుస్థితికి కేంద్ర, రాష్ట్రాల్లోని బజెపి సర్కార్లే కారణమని ఆరోపించారు. కుంభమేళా పేరుతో నిర్వహిస్తున్న హిందు ఆధిపత్య రాజకీయాలతో తొక్కిసలాటలతో పదుల సంఖ్యలో మనుషులు చనిపోవడానికి బిజెపి సర్కార్ల అసమర్థ నిర్వాకమే కారణమని విమర్శించారు. కార్యక్ర మంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.రామ్మోహన్, బి.మ నోహర్, జి.శివకుమార్, వి.అన్వేష్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయలు పరిపాలన ఆదర్శం

ప్రజాశక్తి - కడప అర్బన్



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

శ్రీకృష్ణదేవరాయ పరిపాలన పలువురికి ఆదర్శమని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఆలంకాన్‌పల్లి లక్ష్మిరెడ్డి అన్నారు. ఆదివారం నగరంలోని (కృష్ణ థియేటర్) వద్ద శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహం వద్ద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిపాలనలో పేద, బడుగు, బలహీన వర్గాల వారికి పూర్తిస్థా యిలో న్యాయం చేస్తూ మంచి పరిపాలకుడిగా పేరు తెచ్చుకున్నారన్నారు. దక్షిణ భారతదేశ చరిత్రలో మధ్యయుగ రాజుల్లో శ్రీకృష్ణదేవరాయలు మహా కీర్తి శాలిని పేర్కొన్నారు. అలాంటి రాజనీతిజ్ఞుడు, సాహితీ సమరాంగణ సార్వభౌముడు తెలుగు భాష కోసం పాటుపడటం మనకెంతో గర్వకాం ణమన్నారు. తన పరిపాలనలో వ్యవసాయానికి ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి చెరువులు, కుంటలను తవ్వించడం, గొలుసుకట్టు కాల్వల నిర్మాణం ద్వారా వ్యవసాయాన్ని ప్రోత్సహించి దక్షిణ భారత దేశంలో కరువు లేకుండా చేశారని తెలిపారు. కార్యక్రమంలో పాలకొండ మాజీ చైర్మన్ ఓబులరెడ్డి పాల్గొన్నారు. **కడప:** శ్రీకృష్ణదేవరాయులు గొప్ప పరిపాలనా అధ్యక్షుడని మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, నగర మేయర్ సురేష్ బాబు పేర్కొన్నారు. శ్రీకృష్ణదేవరాయల 534 జయంతి సందర్భంగా ఆదివారం నగరంలోని శ్రీకృష్ణదేవరాయ సర్కిల్ (కృష్ణ థియేటర్) వద్ద శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహం వద్ద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తుమ్మలకుంట శివ శంకర్, అమరప్ప, రాము,యానాదయ, కడప డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, కార్పొరేటర్లు ఐస్క్రీమ్ రవి, మహమ్మద్ షఫీ, మల్లికార్జున కిరణ్, బసవ రాజు, తోటా కృష్ణ, దేవి రెడ్డి ఆదిత్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోజూ ఉదయం నడకను అలవాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

రోజూ ఉదయం నడకను మనలో ఒక భాగం చేసుకోవాలని, అప్పుడే ఆరోగ్యవంతులుగా ఉంటామని కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి అన్నారు. కడప ఆర్ఎసిటిడబ్ల్యుఎ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కడప కోటిరెడ్డి సర్కిల్ నుంచి మహావీర్ సర్కిల్ వరకు 10కె మారథాన్ రన్ నిర్వహించారు. ఎమ్మెల్యే , టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని, మారథాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం వాకింగ్ చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండగలుగుతాం అని అన్నారు. ఉదయం మేల్కొనడం ద్వారా ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయన్నారు. మనమందరం మన జీవితాల్లో నడకను ఒక భాగంగా అలవాటు చేసుకోవాలని కోరారు. కడప నగరంలో ఇటువంటి కార్యక్రమం నిర్వహించిన ఆర్ఎసిటి డబ్ల్యుఎ నిర్వాహకులను, మారథాన్‌లో పాల్గొన్న ఔత్సాహిక రన్నర్స్‌ను అభినందించారు. మారథాన్ లో కడప జిల్లాకు చెందిన చాలా మంది ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




మారథన్ రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవి

అక్షర తపస్వి 'భూతపురి'

వైవీయూ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

కవితా రచనను ఒక తపస్సులా భావించి అనేక మహాకావ్యాలను రచించిన అక్షర తపస్వి డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ అని యోగి వేమన విశ్వవిద్యాలయం విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ మెమోరియల్ ట్రస్టు, అల్లసాని పెద్దన సాహిత్య పీఠం సంయుక్తంగా ఆదివారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలోని బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ 88వ జయంతి, 23వ స్మారక పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అతిథులు దీపప్రకాశనం చేసి, భూతపురి చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ సాహితీకృషి విశిష్టమైందని, ఆయన 1953లో కవిగా సాహితీరంగంలో అడుగుపెట్టి 2002 వరకు అంటే దాదాపు అయిదు దశాబ్దాలపాటు తనదైన విలక్షణతతో సాహితీసేవ చేశారన్నారు. ప్రాచీన మహాకవుల బాటలో ప్రయాణించి, సంస్కృతాంధ్ర భాషల్లో ప్రావీణ్యం సంపాదించి, ప్రబంధశైలిలో ఆంధ్రాభ్యుదయం, శ్రీకృష్ణభారతం వంటి మహాకావ్యాలు రచించారన్నారు. ఆయన సాహితీకృషికి తార్కాణంగా శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ గౌరవ డాక్టరేట్, గండపెండేరం, గజారోహణం లాంటి గొప్ప సత్కారాలు అందుకున్నారన్నారు. పుత్తా పుల్లారెడ్డి వృత్తిరీత్యా ఇంజనీరైనప్పటికీ విమర్శకుడుగా, వ్యాఖ్యాతగా, అనువాదకుడుగా ప్రసిద్ధుడని, బహుగ్రంథకర్త అని, ఆయనను భూతపురి స్మారక పురస్కారంతో సత్కరించడం అభినందనీయమన్నారు. సభాధ్యక్షులు, డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఆచార్య జి.విశ్వనాథ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్యశర్మ బహువిద్యల నేర్పరి అని, ఆయన కవిగా, అవధానిగా, జ్యోతిష వాస్తు శాస్త్రజ్ఞులుగా రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాలలో పేరుప్రతిష్ఠలు సంపాదించుకున్నారన్నారు. ఆయన అనేక ప్రభుత్వ, ప్రభుత్వేతర సత్కారాలు అందుకున్నారన్నారు. పుత్తా పుల్లారెడ్డి మహాభారతంపై సమగ్రమైన అవగాహన ఉన్నవారని, విమర్శ, వ్యాఖ్యానం, అనువాదం వంటి ప్రక్రియల్లో 18 రచనలు చేశారని, ఆయనను భూతపురి పురస్కారంతో సత్కరించడం సముచితమన్నారు. 'మహామహోపాధ్యాయ' ప్రాచార్య శలాక రఘునాథ శర్మ (రాజమండ్రి) మాట్లాడుతూ భూతపురితో తనకు చాలా అనుబంధం ఉందని, ఆయన వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు, కవిత్రయం లాంటి మహాకవులను అధ్యయనం చేసి మహాకావ్యాలు రచించిన ఉత్తమకవి అని పేర్కొన్నారు. గౌరవ అతిథి, ఆకాశవాణి పూర్వ సంచాలకులు ఆకుల మల్లేశ్వర రావు (తిరుపతి) మాట్లాడుతూ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ స్వయంకృషితో ఉన్నతస్థితికి ఎదిగారన్నారు. మరో గౌరవ అతిథి, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ భూతపురి రచించిన శ్రీకృష్ణరక్షణ నాటకం, శ్రీభద్రాచల రామ సుప్రభాతం అనే గ్రంథాల విశిష్టతను సభకు పరిచయం చేశారు. ఆత్మీయ అతిథి, యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ తాను మొదట రామాయణాన్ని రచించిన సందర్భంలో భూతపురి సుబ్రహ్మణ్య శర్మను కలిశానని, యువకుడైన తనను ఆయన ప్రోత్సహించి, చక్కని అభిప్రాయాన్ని కూడా రాసిచ్చారన్నారు. భూతపురి పురస్కార గ్రహీత, 'భారత భారతి' పుత్తా పుల్లారెడ్డిని అతిథులతో కలసి భూతపురి కుమారులు డాక్టర్ శివరామ సురేంద్రశర్మ, డాక్టర్ గోపాలకృష్ణశాస్త్రి రూ.10,116 నగదు, జ్ఞాపిక, తలపాగా, శాలువా, సన్మానపత్రంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, సాహితీ ప్రియులు, భూతపురి ఆత్మీయులు పాల్గొన్నారు.



పురస్కార గ్రహీతను సన్మానిస్తున్న అతిథులు



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న మానస చిన్నపరెడ్డి

నూతన వెంచర్ బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

విక్తామ్న శాండల్ వుడ్ ఆగ్రో ఫార్మ్స్ నూతన వెంచర్ బ్రోచర్‌ను ప్రాజెక్టు డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ డాక్టర్ రంగనాథ్ రెడ్డి, ఇంటాక కన్వీనర్ మానస చిన్నపరెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం మానస ఇందులో బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ గంధం చెట్లపై పెట్టుబడి మన జీవితాలలో సిరి సంపదలు నింపుతాయని తెలిపారు. మన పెట్టుబడులు 12 సంవత్సరాలలో 10 నుంచి 20 రెట్లు అయ్యే అవకాశం ఉందని చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 7013238986 నంబర్ సంప్రదించాలని చెప్పారు.

అరుణకుమారికి డాక్టరేట్

ప్రజాశక్తి - కడప



శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని సోషియాలజీ విభాగం పరిశోధక విద్యార్థిని ఐ. అరుణకుమారికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ తెలిపారు. యూనివర్సిటీలోని సోషియాలజీ విభాగానికి చెందిన విశ్రాంత అధ్యాపకులు ఎం. హనుమంతరావు పర్యవేక్షణలో 'హెల్త్ కేర్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్ ఏ కేస్ స్టడీస్ ఆఫ్ ఆరోగ్యశ్రీ ప్రోగ్రాం ఇన్ వైయస్సార్ డిస్ట్రిక్ ' అనే అంశంపై పరిశోధనా గ్రంథాన్ని యూనివర్సిటీకి సమర్పించారు. ఇందుకుగాను ఎస్‌వియుఐ. అరుణ కుమారికి పిహెచ్‌డి డిగ్రీ ప్రదానం చేసింది. ఆమెకు డాక్టరేట్ అవార్డు రావడం పట్ల పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.

అటెండెన్స్ పడకపోవడం దారుణం : యుటిఎఫ్

ప్రజాశక్తి - కడప అర్బన్

క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల క్లోజింగ్ టైం ఐదు గంటలకే ఉన్నప్పటికీ 530 గంటల వరకు అటెండెన్స్ పడకుండా లాక్ చేయడం, 6 గంటల వరకు యాప్ పని చేయకపోవడం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురి అయ్యారని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్, ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ, సుదూర ప్రాంతాల్లో హాజరైన ఉపాధ్యాయులు ముఖ్యంగా మహిళా ఉపాధ్యాయులు బస్సు సౌకర్యం లేనటువంటి ప్రాంతాల్లో సీనియర్ ఉపాధ్యాయులకు ఇది ఇబ్బంది కలిగించే ప్రమాదం ఉందని తెలిపారు. ఉదయం ఎప్పుడో ఐదు గంటలకు ఇంట్లో బయలుదేరినప్పుడు ఫోన్ ఛార్జింగ్ పెట్టి ఉంటారని, సాయంత్రం 6 గంటలైనా అటెండెన్స్ తీసుకోకపోతే ఫోన్‌లో ఛార్జింగ్ కూడా ఉండే అవకాశం లేదని పేర్కొన్నారు. అలాంటప్పుడ అటెండెన్స్ వేయడానికి ఎలా వీలవుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు రాత్రికి ఎప్పుడో గాని ఇంటికి చేరే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం అధికారులు ఇలాంటి వైఖరి అవలంభించడం సమంజసం కాదని తెలిపారు. క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాల సమయాన్ని వెంటనే మార్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పాఠశాల సమయం నాలుగు గంటలకే ముగించాల్సి ఉండగా కాంప్లెక్స్ మీటింగ్ పేరుతో ఐదు గంటల వరకు పెంచడమే కాకుండా ఐదున్నర గంటల వరకు అటెండెన్స్ పడకుండా చేయడం సరికాదని తెలిపారు.

ఉపాధ్యాయుల ఓపికను పరీక్షించవద్దు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఉపాధ్యాయులకు అర్ధరోజు క్లస్టర్ ట్రైనింగ్ పేరుతో ఫేషియల్ యాప్‌లో సాయంత్రం 5:30 హాజరు వేయడానికి అవకాశం లేకుండా చేయడం దారుణమని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా అధ్యక్షుడు బత్తల వెంకట ప్రసాద్ ఒక ప్రాంతంలో పేర్కొన్నారు. ఉపాధ్యాయినులు శనివారం అటెండెన్స్ కోసం వేచి చూసి ఆలస్యమవడంతో చాలా ఇబ్బందులు పడ్డారన్నారని తెలిపారు. ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడాలని పేర్కొన్నారు. స్కూల్ అసిస్టెంట్‌లకు ఒక నియోజకవర్గం లేదా రెండు మూడు మండలాలకు ఇటువంటి కార్యక్రమాలు జరిపితే బాగుంటిందన్నారు. వాస్తంగా ఈ కాంప్లెక్స్ సమావేశాలు అనవసరమని తెలిపారు. దీని వల్ల ఒక సంవత్సరానికి పది రోజులు విద్యార్థులు చదువు కోల్పోతున్నారని పేర్కొన్నారు. కాంప్లెక్స్ సమావేశాలును రద్దు చేసి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వం వైఫల్యం వల్లే తొక్కిసలాట

ప్రజాశక్తి - కడప : కుంభమేళాకు వచ్చిన భక్తులకు తగిన ఏర్పాటు చేయడంలో కేంద్ర ప్రభుత్వం రైల్వే శాఖ పూర్తిగా విఫలం చెందాయని డిసిసి విజయ జ్యోతి అన్నారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడారు. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్ తొక్కిసలాట లో 18 మంది మృతి చెందారన్నారు. మృతి చెందిన వారికి తీవ్ర సంతాపం, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్లో శనివారం రాత్రి 9:55 గంటలకు జరిగిన తొక్కిసలాటలో ప్రజలు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం అన్నారు. కేంద్ర ప్రభుత్వం తగిన భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుంది అన్నారు. రైల్వే శాఖ రూ. 10 లక్షలు ఎక్స్ గ్రేషియా ప్రకటించడం సంతోషం కానీ , కేంద్ర ప్రభుత్వం మృతుల కుటుంబాలకు తక్షణమే రూ.1 కోటి నష్టపరిహారం అందించాలని, కేంద్ర ప్రభుత్వం ఘటనపై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని, బాధ్యతారాహిత్యంతో వ్యవహరించిన అధికారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రేపు 'థాలీ భజావో'

ప్రజాశక్తి - కడప : సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని, ఈ విషయం ప్రజలకు తెలియజేసేందుకు ఈనెల 18న ఉదయం 11:00 గంటలకు కడప కలెక్టరేట్ కార్యాలయం ఎదుట 'థాలీ భజావో', సూపర్ సిక్స్, సూపర్ ఫ్లాప్" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిసిసి అధ్యక్షులు విజయ జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ప్లేట్లు, స్పూన్లు చేతపట్టి పెద్ద శబ్దంతో నిద్రలో ఉన్న ప్రభుత్వాన్ని నిద్రలేపుతామని పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీకి చెందిన నగర అధ్యక్షులు, జిల్లాలోని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అనుబంధ విభాగాలైన ఎన్ఎస్‌యుఐ, యువజన కాంగ్రెస్, సేవాదళ్, మహిళా కాంగ్రెస్ విభాగాల నాయకులు, అసెంబ్లీ కో-ఆర్డినేటర్లు, జిల్లా, నగర కాంగ్రెస్ నాయకులు అందరూ హాజరై విజయవంతం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. పార్టీ నాయకులు కార్యాలయానికి ఉదయం 10:30 గంటలకు హాజరు కావాలన్నారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించాలి : ఆవాజ్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఏకపక్ష వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించాలని, సవరణ బిల్లు రద్దు చేయకుంటే ప్రతిఘటిస్తామని ఆవాజ్ జిల్లా అధ్యక్షులు చాంద్ బాషా హెచ్చరించారు. ఆదివారం కడప నగరంలో ఆవాజ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బిల్లును గత పార్లమెంటులో వక్ఫ్ చట్ట సవరణ జాయింట్ పార్లమెంటరీ కమిటీని నియమిస్తూ సవరణలపై అభ్యంతరాలు, అభిప్రాయాలు సేకరించి ప్రజాస్వామ్యబద్ధంగా పార్లమెంటుకు ప్రజల, ప్రజా సంఘాల అభిప్రాయాలను సమర్పించాలన్నారు. అలాకాకుండా జెపిసి ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తూ స్పీకర్ మూజువాణితో బిల్లును ఆమోదించడం దుర్మార్గమైన చర్య అన్నారు. ప్రతిపక్ష సభ్యుల అభిప్రాయాలను ఏమాత్రం పట్టించుకోకుండా ఏకపక్ష విధానాలతో వక్ఫ్ బిల్లును ఆమోదించడం రాజ్యాంగ వ్యతిరేకమని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ భారతదేశంలో ఉన్న లక్షల కోట్లు విలువ చేసే వక్ఫ్ ఆస్తులను ఖాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగాన్ని, హక్కులను ప్రజలే ఐక్యంగా ఉద్యమించి కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఆవాజ్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.అన్వర్ బాష, సహాయ కార్యదర్శి ఎస్.షరీఫ్, మెహబూబ్ బాష, ఆవాజ్ జిల్లా నాయకులు ఎస్.గఫూర్, ఎస్. జహంగీర్ బాష, గౌస్ బాషా పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

ఏటా రూ.514 కోట్లు చెల్లింపులు
ఇకెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలి
ట్రెజరీ డిడి ఎం.ఎస్.వెంకటేశ్వర్లు వెల్లడి



ప్రజాశక్తి- కడప ప్రతినిధి

ఈనెలాఖరులోపు పెన్షనర్లు లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి. జిల్లాలోని డ్రాయింగ్ ఆఫీసర్లు ఉద్యోగుల ఇఎల్స్ వివరాలు, జిపిఎఫ్ బ్యాలెన్స్ వివరాలు, ఎస్‌సి కమ్యూనిటీలో కేటగిరీలను నిధి పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలి. సిఎఫ్ఎంఎస్ అమలు నేపథ్యంలో ట్రెజరీ అధికారులపై అదనపు భారం పడింది. దీనికితోడు ఆర్‌టిసి ఉద్యోగులు సైతం ట్రెజరీ పరిధిలోకి రావడంతో భారం రెట్టింపైంది. దీనికితోడు వైద్య ఆరోగ్యశాఖ కూడా ప్రభుత్వ పరిధిలో రానున్న నేపథ్యంలో మరింత భారంగా మారే అవకాశం కనిపిస్తోందని పేర్కొంటున్న ట్రెజరీస్ డిడి ఎం.ఎస్.వెంకటేశ్వర్లుతో ముఖాముఖి...

ముఖా ముఖి..

ట్రెజరీల జాబ్‌చార్టు గురించి తెలపండి?

ట్రెజరీ కార్యాలయాలు ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షనర్ల చెల్లింపులు, వాటి రికార్డులను నిర్వహించడం, కొత్తగా చేరిన ఉద్యోగులకు ఐడి, ఇతర రికార్డులను నిర్వహించడం, పీడీ అకౌంట్ల నిర్వహణ, స్ట్రాంగ్‌రూమ్ నిర్వహణ, ఆప్కోస్, కాంట్రాక్టు, క్లాస్- 4 ఉద్యోగుల సమస్యలను పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుంది.

సబ్‌ట్రెజరీ కార్యాలయాలెన్ని?

తొమ్మిది సబ్‌ట్రెజరీ కార్యాలయాలున్నాయి. కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, మైదుకూరు, ముద్దనూరు, కమలాపురం, పులివెందుల, బద్వేల్, సిద్ధవటం, ప్రాంతాల్లో ఉన్నాయి.

ఉద్యోగుల వివరాలు చెప్పండి?

జిల్లాలో 22 వేల మంది ఉద్యోగులు, 18 వేల మంది పెన్షనర్స్ ఉన్నారు. ప్రతి నెలా సదరు ఉద్యోగుల జీతభత్యాల, పెన్షన్స్, వంటి ఇతర చెల్లింపులు ప్రక్రియ నడుస్తోంది. వీటితోపాటు రిటైర్డు ఉద్యోగుల బకాయిలు, గ్రాట్యూటీ చెల్లింపులను చేయడం గమనార్హం.

ట్రెజరీ చెల్లింపుల గురించి తెలపండి?

ఏటా ట్రెజరీశాఖ ద్వారా రూ.514 కోట్లు మేర ఉద్యోగుల జీతభత్యాలు, పెన్షనర్లకు సంబందించి పెన్షన్ల రూపంలో చెల్లింపులు చేయడం జరుగుతోంది. డిఎలు, పిఆర్‌సిని అమలు చేస్తే పెరిగే అవకాశం ఉంది.

పీడీ అకౌంట్లు కలిగిన డిపార్టుమెంట్లు ఎన్ని?

జిల్లాలో 10 శాఖల వరకు ఉన్నారు. ఇందులో వైద్య ఆరోగ్య శాఖ, డ్వామా, స్పోర్ట్స్‌స్కూల్, యూనివర్శిటీ, ఆర్కిటెక్షర్ యూనివర్శిటీ సహా ఇతర శాఖల పరిధిలోని ఉద్యోగులు ఉన్నారు. వీటి పరిధిలోని ఉద్యోగు లకు పిడీ అకౌంట్ల ద్వారా జీతభత్యాలు చెల్లింపులు చేయడం జరుగుతుంది.

ఆప్కోస్ ఉద్యోగుల పరిస్థితేమిటి?

ఆప్కోస్‌ఉద్యోగులకు సంబంధించి ఎటువంటి సమాచారం లేదు. జిల్లాలో ఆప్కోస్ కింద 3,600 మంది, అవుట్‌సోర్సింగ్ కింద 1100, కాంట్రాక్టు ఉద్యోగులు 2,000 మంది వరకు ఉన్నారు. ఈనెల వరకు యథా విధిగానే జీతభత్యాలు అందించే అవకాశం ఉంది.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్

శ్రీరంగనాథ స్వామి చరిత్ర పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి -పులివెందుల టౌన్

పులివెందులలో కొలువైన మధ్యరంగ క్షేత్రంగా పేరుగాంచిన శ్రీ రంగనాథ స్వామి చరిత్ర పుస్తకాన్ని ఆలయ చైర్మన్ చింతకుంట సుధీకర్‌రెడ్డి, ఇఒకొట్టే వెంకట రమణ ఆదివారం ఆవిష్కరించారు. 1929లో కీ.శే.లగిశెట్టి వెంకటరమణయ్య రచించిన పులివెందుల చరిత్ర పుస్తకం ఆధారంగా సీనియర్ జర్నలిస్ట్ రచయిత అల్లం రంగనాయకులు రాయల్ తాను సేకరించిన చారిత్రక అంశాలను, మరిన్ని నూతన విషయాలను తీర్చిదిద్ది మళ్లీ పుస్తకాన్ని నూతనంగా తీసుకువచ్చారు. ఈ సందర్భంగా స్థానిక పూలంగళ్ళ సర్కిల్ వద్ద ఉన్న శ్రీ రంగనాథ స్వామి కళ్యాణ మండపంలో ఆదివారం ఈ చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. చైర్మన్ సుధీకర్ రెడ్డి మాట్లాడుతూ పులివెందులకు మూలాధారమైన శ్రీ రంగనాథ స్వామి కథను ,అలాగే పులివెందుల చరిత్రను తెలియజేసే పుస్తకాన్ని రూపొందించిన రచయిత అల్లం రంగనాయకులు రాయల్‌ను అభినందించారు. ఈ పుస్తకం తీసుకురావడానికి కృషిచేసిన కీర్తిశేషులు రచయిత లగిసెట్టి వెంకటరమణయ్య మనుమళుి లగిశెట్టి వెంకట వివేకానందమూర్తి, తోటంశెట్టి జనార్దన్ బాబు, శ్రీ రంగనాథ ట్రస్ట్ చైర్మన్ అల్లం చిన్న రంగనాయకులను అభినందించి సన్మానించారు. కార్యక్రమాల్లో ఆలయ ప్రధాన అర్చకులు సోమేపల్లి కృష్ణరాజ్ శర్మ, చల్ల నారాయణస్వామి, చల్లా చంద్రశేఖర్ నాయుడు, మాజీ చైర్మన్ పద్ధతి నారాయణ, ఆలయ పాలకమండలి సభ్యులు మాధవాచారి, మల్లికార్జున శెట్టి, సీనియర్ జర్నలిస్ట్ ఓం ప్రకాష్ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రాగి వైరు చోరీ ఘటనలో కానిస్టేబుల్ సస్పెన్షన్

ప్రజాశక్తి- ఖాజీపేట

స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్‌ను ఎస్‌పి ఆదివారం సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఇటీవల రైతులకు చెందిన వ్యవసాయ మోటార్లు కొందరు దుండగులు ధ్వంసం చేసి అందులో రాగి వైర్‌ను ఎత్తుకెళ్ళి పోయారు. చోరీకి సంబంధించిన రాగి వైర్‌ను నిందితుల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తును న్యాయస్థానంలో ప్రవేశ పెట్టేందుకు పోలీసులు చర్యలు తీసుకొనే క్రమంలో చోరీకి గురైన వైర్ కనిపించలేదు. దీంతో పోలీస్ ఉన్నతాధికారి సిసి కెమెరాను పరిశీలించగా సిబ్బంది ఒకరు రాగి వైర్‌ను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు విచారించి ఎస్‌పికి తెలిపారు. ఆ మేరకు ఆయన కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఆదివారం ఆదేశాలు వెలువరించినట్లు సమాచారం.



సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ నాయకులు

ప్రేమోన్మాదికి ఉరి శిక్ష వేయాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రభుత్వాలు మారినా మహిళల మీద దాడులు ఆగలేదని, మహిళల భద్రతకున్న చట్టాలు కఠినంగా అమలుచేయాలని అన్నమయ్య జిల్లాలో గాయత్రి ముఖం మీద యాసిడ్, కత్తితో దాడి చేసిన ప్రేమోన్మాది గణేష్‌ను ఉరి తీయాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో చిన్నారుల నుంచి పండు ముసలి వరకు ప్రతి గంటకు 17 మంది మీద హత్యాచారం, మానభంగం, హత్య లైంగిక వేధింపులు తీవ్రతరం అవుతున్నాయని వాపోయారు. వాటిని అదుపు చేయాల్సిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో మరిన్ని దాడులు చోటు చేసుకుంటన్నాయని చెప్పారు. ఇదే దుస్థితి కొనసాగితే మహిళలను మ్యూజియంలో చూసే పరిస్థితి వస్తుందన్నారు. మరోవైపు మహిళలకు రక్షణ ఇవ్వలేని ప్రభుత్వాలు జనాభాను పెంచండి ఆదేశాలు ఇవ్వడంసరైనది కాదన్నారు. గణేష్‌ను అరెస్ట్‌తో సరిపెట్టకుండా మరో ఉన్మాది తయారుగాకుండా ఉరిశిక్ష వేయాలని కోరారు. సమావేశంలో పట్టణ నాయకులు సురేంద్ర రెడ్డి, ఇసాక్ పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్

సాంస్కృతిక పోటీల్లో ట్రిపుల్‌ఐటి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వేంపల్లె

సాంస్కృతిక పోటీల్లో ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటి విద్యార్థులు అత్యంత ప్రతిభను సాధించినట్లు డైరెక్టర్ ఎవిఎస్ కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. గుంటూరు జిల్లా వడ్లమూడి గ్రామం విజ్ఞాన్ యూనివర్సిటీలో నిర్వహించిన విజ్ఞాన్ మహోత్సవ్ 2025 కార్యక్రమంలో భాగంగా సాహిత్య, కళా పోటీలలో ట్రిపుల్ ఐటి విద్యార్థిని విద్యార్థులు జీవన్, శ్రీమన్నార్, కైసిప్, అఖిల్ అహ్మద్, రూప శ్రీ, సంతోషిని ప్రణతి, లిఖితాంజలి, విజయ భాస్కర్, అఖిల, సిద్ధార్థ, కులశేఖర్, కార్తీక్, యజ్ఞ తమ ప్రతిభను చూసి రాణించారు. క్విజ్ పోటీల్లో రెండవ స్థానం, మాస్టర్ పోరేటర్‌లో మూడో స్థానం, శాస్త్రీయ సంగీత పోటీల్లో మూడో స్థానం, తేక్వాండ్‌లో రెండవ స్థానం సాధించినట్లు తెలిపారు. వివిధ పోటీల్లో ప్రతిభ సాధించడం పట్ల డైరెక్టర్‌తో పాటు ఆంగ్ల అధ్యాపకులు మణికిరణ్, ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేసి విద్యార్థులను అభినందించారు.

క్రైం కార్నర్

గడ్డివాములు, మోటార్ బైకులు దగ్ధం

- రూ.2 లక్షలకు పైగా నష్టం



దగ్ధమవుతున్న గడ్డివాములు

ప్రజాశక్తి - వేంపల్లె : పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గడ్డివాములు, రెండు మోటార్ బైకులు దగ్ధమయ్యాయి.. ఆదివారం రాయచోటి–పులివెందుల బైపాస్ రోడ్డులో ఉన్న ఒక ప్రయివేట్ పెట్రోల్ బంక్ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితుడు దూద్ పీర్ తెలిపిన వివరాల మేరకు.. నాలుగు సంవత్సరాలుగా బైపాస్ రోడ్డులో వరి గడ్డి వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డి వాములకు నిప్పు పెట్టడంతో పెద్దగా మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల ఉన్న ప్రజలు మంటలు పైకి ఎగసిపడడంతో గమనించి వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమా చారం అందించారు. ఫైర్ ఇంజన్ సిబ్బంది సహకారంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అప్పటికే గడ్డివాములతో పాటు పక్కనే పార్కు చేసిన రెండు మోటార్ బైకులు కాలి బూడిద అయ్యాయి. దీంతో రూ. 2 లక్షలకుపైగా ఆస్తి నష్టం వాటిల్లింది.అధికారులు స్పందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.

అంధకారంలో 'వెలుగు'

- కనీస వసతులు శూన్యం
- పని చేయని ఫ్యాన్లు
- తాగునీటి సౌకర్యం నిల్
- బాత్రూమ్‌లు లేక మహిళల అవస్థలు
- పట్టని అధికారులు



వెలుగు కార్యాలయం

ప్రజాశక్తి - గోపవరం

మండలంలోని డిఆర్‌డిఎ వెలుగు కార్యాలయంలో మౌలిక వసతులు కరువయ్యాయి. పగలే కార్యాలయం అంధకారంలో కొట్టుమిట్టాడుతోంది. ముఖ్యంగా బాత్రూమ్‌లు లేక మహిళలు నానా అవస్థలు పడుతున్నారు. 20 ఏళ్ల కిందట స్వయం సహాయ సంఘాల మహిళలకు కోసం స్త్రీ శక్తి భవనం ఏర్పాటు చేశారు. మండలంలో దాదాపు 446 మహిళా సంఘాలు ఉన్నాయి. ఒక్కొక్క సంఘానికి 10 మంది చొప్పున 4,465 మంది సభ్యులు ఉన్నారు. వెలుగు కార్యాలయంలో మహిళలు నెలకు 1 లేదా 2 సార్లు సమావేశాలు నిర్వహిస్తారు. వారికి కనీస వసతులు కల్పించలేదు. తాగునీటి సౌకర్యం లేదు. కార్యాలయంలో లైట్లు, ఫ్యాన్లు పనిచేయవు. ముఖ్యంగా బాత్రూమ్‌లు, మరుగుదొడ్లు లేకపోవడంతో వారు నానా అవస్థలు పడుతున్నారు. ఇలాంటి సమయంలో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గదుల కిటికీలకు తలుపులు లేకపోవడంతో సమావేశం నిర్వహించే సమయాలలో కోతులు, పాములు, తేళ్ళు, విష సర్పాలు వస్తూ ఉంటాయని వాపోతున్నారు. అవి రాకుండా కిటికీలకు జల్లెడ లాగా బిగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యుత్ సమస్య చాలా ఏళ్లుగా ఉంటోందని, తరచూ వస్తు పోతూ ఉండడంతో ఫ్యాన్లు పూర్తిగా పాడైపోయాయి, కంప్యూటర్లు చెడిపోయాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కరెంటు బోర్డులు కాలిపోవడంతో అర్థం కాని పరిస్థితి. రాబోయే వేసవిలో కరెంటు సమస్య పరిష్కరించకపోతే సమావేశాలు నిర్వహించాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంటుందని సంఘాల లీడర్లు, మహిళ పేర్కొంటున్నారు. సమావేశానికి వచ్చే మహిళలకు కనీసం బాత్రూం కూడా లేకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కార్యాలయంలో నెలకొన్న సమస్యలపై పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారంలో అధికారులు విఫలం చెందుతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సాధించి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని స్వయం సహాయక సంఘం గ్రూపు మహిళలు ముక్తకంఠంతో కోరుతున్నారు. మరి అధికారులు ఏరకంగా స్పందిస్తారో వేచి చూడాలి.



కార్యాలయంలో పనిచేయని ఫ్యాన్లు

చికెన్‌కు బర్డ్ ఫ్లూ దెబ్బ

తగ్గిన విక్రయాలు
మటన్, ఫిష్‌కు పెరిగిన డిమాండ్



వెలవెల బోతున్న చికెన్ దుకాణం, చేపలు కొంటున్న ప్రజలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

బర్డ్ ఫ్లూ కలకలం చికెన్ విక్రయాలపై ప్రభావం చూపుతోంది. నిన్న, మొన్నటి వరకు గోదావరి జిల్లాలను వణికించిన బర్డ్ ఫ్లూ ఇప్పుడు జిల్లాకు పాకింది. బర్డ్‌ఫ్లూ లక్షణాలతో వేల సంఖ్యలో బ్రాయిలర్ కోళ్లు మృత్యువాత పడడంతో చికెన్ కొనుగోలు చేసేందుకు ప్రజలు వెనుకాడుతున్నారు. బర్డ్ ఫ్లూ అని నిర్ధారణ కాకపోయినప్పటికీ ఒకే కోళ్ల ఫారంలో వేల సంఖ్యలో కోళ్ల మృ త్యువాత పడడం ఆందోళనకు దారి తీసింది. అధికారులు సైతం చికెన్, గుడ్లు తినడం కొంతకాలం ఆపేయాలంటూ సూచన చేస్తున్న క్రమంలో పౌల్ట్రీ పరిశ్రమ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. గ్రామాలలో ఎక్కువ శాతం నాటుకోడి చికెన్ తింటున్నారు. నాటుకోడి మటన్‌తో సమానంగా విక్రయిస్తున్నారు. నాటుకోడి మాంసంలో రూ.750 బాగా మటన్ రూ .800కు విక్రయిస్తున్నారు. చిన్నపిల్లలు ఎక్కువగా చికెన్ తినే అలవాటు ఉండటంతో తల్లిదండ్రులు పిల్లల కోసం మటన్‌తోపాటు నాటుకోడి కొనుగోలు చేస్తున్నారు.

మటన్, ఫిష్‌కు డిమాండ్

బర్డ్ ఫ్లూ ప్రభావంతో చికెన్ కొనుగోలు చేసేందుకు ప్రజలు వెనుకాడుతున్న నేపథ్యంలో కోళ్ల రవాణా నిలిచిపోయింది. ఉన్న కోళ్లను అవే ధరలకు విక్రయిస్తున్నారు. బ్రాయిలర్ చికెన్ రూ.180 నుంచి వరకు విక్రయిస్తున్నారు. రెస్టారెంట్లు, హోటళ్లలో సైతం చికెన్ ఆర్డర్లు చేసేందుకు భోజన ప్రియులు వెనుకా డుతున్నారు. దీనితో కొంచెం ధర ఎక్కువైనా మటన్, ఫిష్, ప్రాన్స్‌తో కూడిన ఆహార పదార్థాలనే ఆర్డరు చేస్తున్నారు. దీంతో మటన్, ఫిష్, ప్రాన్స్ విక్రయాలు జోరుగా జరుగుతున్నాయి.

బర్డ్ ఫ్లూను లెక్కచేయని మద్యం ప్రియులు

వైన్ షాపుల వద్ద స్నాక్స్ పాయింట్లు, పలు హోటళ్లలో ఇంకా చికెన్ వంటకాలను తయారు చేస్తున్న క్రమంలో విక్రయాలు కొనసాగుతూనే ఉన్నాయి. మద్యం ప్రియులు మందులోకి ఎక్కువగా చికెన్ పకోడా, కబాబ్‌లుకొనుగోలు చేస్తున్నారు. బర్డ్ ఫ్లూ మమ్మల్ని ఏం చేస్తుందిలే అంటూ మందుబాబులు మాత్రం తినడం మానలేదు.



పదో తరగతి విద్యార్థులతో ఫౌండర్, ఉపాధ్యాయులు

ప్రతి విద్యార్థీ టాప్‌వన్‌లో నిలవాలి

- ఫౌండర్ గురుదేవ్ రామిరెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రతి విద్యార్థీ టాప్ వన్‌లో నిలిచేందుకు ప్రయత్నం చేయాలని టికెఆర్ జీవన్ జ్యోతి ఫౌండర్ గురుదేవ్ రామ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక టికెఆర్ హైస్కూల్‌లో ఫేర్వెల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండర్ మాట్లాడుతూ గత ఏడాది జమ్మలమడుగు పట్టణంలో, నియోజకవర్గంలో మొదటి స్థానంలో మన పాఠశాల నిలిచిందన్నారు. అదే కృషి, పట్టుదలతో విద్యార్థులందరూ చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. క్రమశిక్షణ కలిగిన ప్రతి ఒక్కరూ జీవితంలో రాణిస్తారన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు డిసి గురుశేఖర్ యాదవ్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య మంచి భవిష్యత్తును ఇస్తుందని చెప్పారు. ఉజ్వల భవిష్యత్తుకు పదవ తరగతి మార్కులు దోహదపడతాయన్నారు. 9వ తరగతి విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులను గమనించి మలుచుకోవాలన్నారు. ఇష్టపడి సబ్జెక్టును చదివితే కష్టం ఉండదన్నారు. ప్రణాళికతో చదవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో 10వ తరగతి ఉపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త,కౌన్సిలర్ ఇర్ఫాన్‌బాష అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం అయింది. ప్రొద్దుటూరు నుండే కాక రాజుపాలెం మండలం నుండి ప్రజలు తరలివచ్చి వైద్య సేవలు పొందారు. 350మందికిపైగా పరీక్షలు చేయించుకున్నారు. 200 మందికి పైగా గుండె సంబంధిత పరీక్షలు చేయించుకున్నారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇర్ఫాన్‌బాష మాట్లాడుతూ తరచుగా వైద్య పరీక్షలు చేయించుకుంటే ప్రారంభ దశలోనే వ్యాధులను నివారించవచ్చని అన్నారు. తన అభ్యర్థనను మన్నించి శిబిరంలో వైద్యసేవలు అందించినందుకు వైద్యులకు, హోలిస్టిక్ యాజమాన్యానికి, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో నియోజకవర్గ ప్రజల సౌకర్యార్థం మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

యుసిఐఎల్‌లో స్వచ్ఛత పక్షోత్సవాలు

ప్రజాశక్తి - వేముల

స్వచ్ఛతా పక్షోత్సవాలలో భాగంగా యురేనియం కార్పొరేషన్ అఫ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో ఆదివారం తుమ్మలపల్లెలో స్వచ్ఛతా పక్షోత్సవాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని నిర్ణయించారు. యుసిఐఎల్ జనరల్ మేనేజర్ సుమన్ సర్కార్ గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ పరిశుభ్రత అందరి బాధ్యత అన్నారు. పరిశుభ్రత గురించి ప్రజలకు వివరించారు. ఇందులో భాగంగాఅధికారులు ప్రజలతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం చీపుర్లు చేతపట్టి పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. తుమ్మలపల్లె గ్రామస్తులు, సర్పంచ్ విజ్ఞప్తి మేరకు మబ్బుచింతలపల్లి వాగును శుభ్రం చేశారు. అన్ని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. ప్రజల విజ్ఞప్తి మేరకు మరిన్ని పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాలు ఈనెల 28 వరకు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సుమన్ సర్కార్, మైన్ ఏజెంట్ కిషోర్ భగత్, డిజిఎం మతివనన్, సిఎస్ఆర్ అధికారి డాక్టర్ నవీన్ కుమార్ రెడ్డి, దినేష్ కన్నన్, విపిన్ శర్మ, అంజాద్ అలీ, రవిశంకర్, యశ్వంత్, తారక్, కో–ఆర్డినేటర్ గంగిరెడ్డి, గ్రామ సర్పంచులు, ప్రజలు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

పరిశుభ్రతను పాటించాలి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత,పరిసరాల శుభ్రతను పాటించాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి మురళీధర్‌మూర్తి అన్నారు. బిసి బాలికల వసతి గృహంలో ఆదివారం బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, కీటక జనిత వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడు వాపు, బోదకాలు వ్యాధుల గురించి వివరించారు. దోమల ద్వార వ్యాపించే వ్యాధుల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారి మనోరాణి, సిఒ సుబ్బారెడ్డి,ఆరోగ్య సహాయకులు శ్రీనివాసులు, ఎఎన్ఎం ఆషాలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

శిల్పారామంలో చిన్నారులు చేసిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం కోలా ప్రసాద్ వారి సహకారంతో మనూస్ డ్యాన్స్ అకాడమీ, కదిరి వారు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్, డాన్స్ మాస్టర్ మనోహర్, కోలా ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మత స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడి

ప్రజాశక్తి - కడప అర్బన్

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు మత స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడి అని కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ మాజీ ఇన్‌ఛార్జి సయ్యద్ గౌస్ పీర్ అన్నారు. ఆదివారం నగరంలో ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే వక్ఫ్ బిల్లులో చాల లోపాలున్నాయని కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమిగా ఆ బిల్లు సవరణను వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. అనాదిగా వస్తున్న వాక్స్ బోర్డ్ ఆస్తుల విషయంలో బిజెపి ప్రభుత్వం కుట్రపన్నుతోందన్నారు. వక్ఫ్ ఆస్తులను కొంతమంది కార్పొరేట్ బడా బాబులకు ధారా దత్తం చేసేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. వక్ఫ్ ఆస్తులలో ప్రభుత్వాల జోక్యం తగదన్నారు. సచార్ కమిటీ నివేదిక ప్రకారం ముస్లిం మైనారిటీలు విద్యలో చాలా వెనుకబడి ఉన్నారని, బడుగు, బలహీన వర్గాల కన్నా ముస్లిం మైనారిటీ వెనకబడి ఉన్నారని తెలిపారు. ముస్లిం మైనార్టీ సమాజ అభివృద్ధికి ఈ వక్ఫ్ ఆస్తులు ఉపయోగపడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెఎసి కన్వీనర్ సయ్యద్ బాబు బాయ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సత్తార్, సిపిఎం నగర నాయకులు చంద్రారెడ్డి, జాకీర్ మౌలానా, తాహిర్, మహ్మద్ అలీలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌస్‌పీర్

హామీలను మరిచిన కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - వేంపల్లె : కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను మరిచిందని ఎంపిటిసి రహంతుల్లా ఖాన్ పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీలను గాలికి వదిలేసిందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు వాలంటీర్లకు రూ. 5 వేల నుంచి రూ. 10 వేలు చేస్తామని పవన్ కల్యాణ్ ఉచిత పలుకులు పలికారని పేర్కొన్నారు. మదనపల్లెలో మహిళాపై యాసిడ్ దాడి జరిగితే యాత్రలో ఉన్నానని డిప్యూటీ సిఎం రాలేదని చెప్పారు. విజయవాడలో మ్యూజికల్ కన్సర్ట్‌కు మాత్రం యాత్ర మానుకోని డిప్యూటీ సిఎం రావడం శోచనీయం అన్నారు. కూటమి ప్రభుత్వంలో పవన్ కల్యాణ్ పరిస్థితి అయోమయంగా మారిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని తెలిపారు. గత ప్రభుత్వంలో జగన్ మోహన్ రెడ్డి ఉన్నపుడు కరోనా లాంటి సంక్షోభంలో కూడా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారని చెప్పారు. కర్నూల్‌కు దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని చెప్పిన పవన్ కల్యాణ్ ఎక్కడా ఉన్నారో అర్థం కావడం లేదన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వ ప్రజా దృష్ట్యా పాలన చేయాలని కోరారు.

రేపు బిసి రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - ముద్దనూరు : బిసి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంగళవారం ఉదయం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ ముకుందారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా బ్యాంకుల ప్రతినిధుల సమక్షంలో యూనిట్లకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రుణాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు దరఖాస్తుఫారంతోపాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు వెంట తీసుకురావాలని ఎంపిడిఒ కోరారు.

ప్రజల ప్రాణాలు బలిగొంటున్న బిజెపి

ప్రజాశక్తి - కడప : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమాయక ప్రజల ప్రాణాలను బలి తీసు కుంటోందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ ఆరోపించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ రాజ్‌లోని మహాకుంభమేళాలో అక్కడి బిజెపి ప్రభుత్వ ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ వేల మంది ప్రాణాలు బలిగొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భక్తుల సంఖ్యను ప్రకటించిన ప్రభుత్వం, అక్కడి మృతుల సంఖ్యను దాచిపెట్టి శవాలను నిర్మానుష్య ప్రదేశాల్లో పారావేసిందని ఆరోపించారు. తాజాగా ప్రజలు ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిస లాటలో పదుల సంఖ్యలో చనిపోయా రన్నారు. కేవలం విఐపి లకు మాత్రమే గొడుగు పడుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సామాన్య ప్రజలను ప్రాణాలు బలి ఇస్తున్నారని ఆరోపించారు. రైల్వే స్టేషన్లలో తొక్కిసలాట, కుంభమేళాలో తొక్కిసలాటలో వందలు, వేలాదిమంది అభాగ్యులు దుర్మరణం చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాక్షస ప్రభుత్వాన్ని అంతమొందించేందుకు ప్రజలందరూ మరో స్వాతంత్ర్య సమరానికి సన్నద్ధం కావాల నీ పిలుపునిచ్చారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు

అప్పనపల్లెలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- ఖాజీపేట

మండల పరిధిలోని అప్పనపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కడపకు చెందిన ప్రముఖ సన్ రైజ్ ఆసుపత్రి యాజమాన్యం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా ఆసుపత్రి ఎం డి. జనరల్ సర్జన్ వైద్యులు, డాక్టర్ విజయ విజయ భాస్కర్ రెడ్డితో పాటు, పలు విభాగాలకు చెందిన వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. వైద్య శిబిరానికి దాదాపు 200 మందికి పైగా రోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రి ఎమ్‌డి విజయ్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి వైద్యం గ్రామీణలకు అందించాలన్న ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వైద్యులు ములపాకు పవన్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీ వేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఆస్ట్రి ఆస్తిర్ ఐటి సొల్యూషన్స్ కంపెనీ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ క్యాంపస్ డ్రైవ్‌కు డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు హాజరయ్యారు. వారిలో పది మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ అర్కాట వేముల హరినారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భాన్ని ఉద్దేశించి కళాశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ ఆరో సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులు పాల్గొని ఉద్యోగాలు సాధించారన్నారు. విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసే లోపే మరిన్ని కంపెనీలు కళాశాలకు తీసుకువచ్చి క్యాంపస్ డ్రైవ్లు నిర్వహించి డిగ్రీతో పాటు ఉద్యోగంతో బయటకు పోయేలా చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో కంపెనీ హెచ్‌ఆర్‌లు , కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మహమ్మద్ ముస్తఫా, వైస్ ప్రిన్సిపల్ శారదా భవాని, పృధ్వి నారాయణ, కళాశాల కో–ఆర్డినేటర్ పి గౌరీ శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్, ప్రిన్సిపల్